జాతిపితకు ఘన నివాళి



బొటానికల్ గార్డెన్‌లో గాంధీజీకి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గాంధీ



జీహెచ్ఎంసీ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్



శేరిలింగంపల్లిలో.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్



శేరిలింగంపల్లిలో.. నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌యాదవ్

శేరిలింగంపల్లి జోన్ బృందం: జాతిపిత మహాత్మా గాంధీకి శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని పలు చోట్ల ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు గాంధీజీకి నివాళులు అర్పించారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు: ఆదర్శప్రాయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణంలోని జీహెచ్ఎంసీ కార్యాలయం, గాంధీ పార్క్, ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గల గాంధీ విగ్రహాలకు ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సత్యం, అహింస పద్ధతుల ద్వారా దేశానికి స్వతంత్రం తీసుకు వచ్చిన మహోన్నత నాయకుడు మహాత్మా గాంధీ అని కొనియాడారు. కార్యక్రమాల్లో ఎంపీపీ సుష్మా శ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, ఎంపీడీఓ బన్సీలాల్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, సీనియర్ నాయకులు దశరథరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొండాపూర్ కార్యాలయంలో.. కార్పొరేటర్ హమీద్‌పటేల్ తదితరులు



బాపునగర్‌లో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు



కొండాపూర్‌లోని సీఆర్‌ఫౌండేషన్‌లో.. జాతీయ నాయకులు డాక్టర్ నారాయణ తదితరులు



మాదాపూర్‌లోని స్వాతి స్కూల్‌లో..



కొండాపూర్ 8వ బెటాలియన్‌లో..

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

- టాస్కులు, కమీషన్‌ల పేరుతో మోసం
- ఇద్దరు ఉద్యోగుల్లో ఒకరు రూ.13 లక్షలు, మరొకరు రూ.6 లక్షలు
- మరో ఉద్యోగిని రూ.7 లక్షలు పోగొట్టుకున్న వైనం

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు లక్షలు పోగొట్టుకున్నారు. ఒకరు రూ.13 లక్షల 20 వేలు, మరొకరు రూ. 6 లక్షలు 50 వేలు పోగొట్టుకోగా మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రూ.7 లక్షల 50 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని కృష్ణానగర్ బీరంగూడకు చెందిన ఓ ఉద్యోగికి సెప్టెంబర్ 18వ తేదీన పార్ట్ టైం జాబ్ అంటూ తన వాట్సాప్ కు మెసేజ్ వచ్చింది.దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్ లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.13 లక్షల 20 వేలు చెల్లించాడు.ఆ ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయిన్నట్లు గుర్తించి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా అమీన్‌పూర్ పరిధిలోని కృష్ణ భగవాన్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సెప్టెంబర్ 18వ తేదీన జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్ చేస్తూ ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తూ మొత్తం 6 లక్షల 50 వేలు ఇన్వెస్ట్ చేశాడు,చివరికి తాను పెట్టినగదు తో పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి సోమవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ సాయి భగవాన్ కాలనీకి చెందిన సాఫ్ట్ వేర్ ఉద్యోగినికి సెప్టెంబర్ 17వ తేదీన జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితురాలు తన వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్ చేస్తూ ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తూ మొత్తం రూ.7 లక్షల 50 వేలు ఇన్వెస్ట్ చేసింది,చివరికి తాను పెట్టిన నగదు తో పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితురాలు తాను మోసపోయిన్నట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి సోమవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విజేతలకు బహుమతులు పంపిణీ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని జీహెచ్ఎంసి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక 9వ జాతీయస్థాయి ఛాంపియన్‌షిప్ కార్యక్రమానికి గూడెం మధుసూదన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశనుండే క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్, క్రీడాకారులు పాల్గొన్నారు.

160 షాపులతో కాంప్లెక్స్

- దేశంలోనే మొట్టమొదటిసారి
- జియాగూడ మీట్ మార్కెట్ తరలిస్తాం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్‌చెరు: దేశంలోనే మొట్టమొదటిసారిగా 160 దుకాణాలతో వ్యవసాయ మార్కెట్ యార్డులో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డును రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ. 20.46 కోట్ల అంచనాతో 160 దుకాణ సముదాయాల నిర్మాణ పనులకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజయ్ కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గంలో రైతులు, కొనుగోలుదారులు, వ్యాపారస్తుల సౌకర్యార్థం 2016లో సీఎం కేసీఆర్ సహకారంతో 14 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేశామని చేశారు. నాటి నుంచి దశలవారీగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళ్తున్నామని వెల్లడించారు. త్వరలో జియాగూడలో ఉన్న మీట్ మార్కెట్ సైతం పటాన్‌చెరుకు తరలిస్తామన్నారు. పెరుగుతున్న వ్యాపారాలకు అనుగుణంగా యార్డు పక్కనే గల 40 ఎకరాల రైల్వే స్థలం అందించాలని పార్లమెంట్ సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి ద్వారా ఆ శాఖకు విన్నవించామని తెలిపారు. అనంతరం యార్డు చైర్‌పర్సన్, డైరెక్టర్‌లు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి, ఎంపీపీ సుష్మా శ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమగ్రాభివృద్ధి

పార్టీ నాయకులు రఘునాథ్ యాదవ్

గచ్చిబౌలి: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సమగ్ర అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు రఘునాథ్ యాదవ్ అన్నారు. సోమవారం కొండాపూర్ పార్టీ కార్యాలయంలో పీఏనగర్, మక్తాకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రఘునాథ్ యాదవ్‌మాట్లాడుతూ కాంగ్రెస్ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుందన్నారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం, రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో జెరిపాటి శ్రీను, సాయిరాం, మంగమ్మ, నాగరాజు, జాకేత్, రాములు గౌడ్, రాంచందర్, కుమార్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో నాయకులు రఘునాథ్ యాదవ్

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో కొనసాగుతున్న హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంటుంది. సంప్రదాయ చేనేత చీరలు కొనుగోలు చేసేందుకు నగర నలుమూలల నుంచి మహిళల పెద్ద ఎత్తున ఈ ప్రదర్శనకు తరలివస్తున్నారు. గత నెల 29న ప్రారంభమైన ఈ ప్రదర్శన ఈ నెల 4వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు

పటాన్‌చెరు టౌన్: ఆశా వర్కర్లకు పనికి తగ్గ వేతనం రూ.18 వేల రూపాయలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పటాన్‌చెరులో ఆశా వర్కర్ల రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా 8వ రోజు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ... ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు .ఫిక్స్ వేతనం 18 వేలు ఇవ్వాలన్నారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు గీత, హైమావతి, మాధవి,వైష్ణవి, వీరమణి, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు



ఉచిత కంటి వైద్యశిబిరంలో ట్రస్ట్ చైర్మన్ భిక్షపతి యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: సందయ్య మెమోరియటల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దీనబంధు కాలనీలో నిర్వహించిన శిబిరంలో సుమారు 700మందికి కంటి అద్దాలను ట్రస్ట్ చైర్మన్ భిక్షపతియాదవ్, సెక్రటరీ రవికుమార్ యాదవ్‌ల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ప్రజాసేవకు, అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, పర్వతాలు యాదవ్, బాలు యాదవ్, శ్రీహరి యాదవ్, శ్రీధర్ పటేల్, శ్రీకాంత్ యాదవ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ లడ్డూ రూ.10 లక్షలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని రామేశ్వరంబండ వీకర్ సెక్షన్ కాలనీలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన లడ్డూ వేలంపాటలో గ్రామ సర్పంచ్ ధరణి అంతిరెడ్డి రూ.10 లక్షల 8 వేలకు దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు సర్పంచ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి లడ్డూను అందజేశారు.

గుంతలమయం.. పార్కింగ్ స్థలం



వెంకటేశ్వరకాలనీ: ఇటీవల కురిసిన వర్షాలకు బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న పార్కింగ్ స్థలాలతో పాటు జీహెచ్ఎంసీ వాక్‌వే సైతం పలుచోట్ల ధ్వంసమయ్యాయి. ఈ సమస్యలపై వాకర్లు, సందర్శకులు పలు మార్లు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే ఇతర అధికారులతో కలిసి కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్‌వేలో పర్యటించి గుంతలమయమైన వాక్‌వేను బాగు చేయాలని, చెత్తా చెదారాన్ని తొలగించాలని, వాకర్లకు సమస్యలు లేకుండా చూడాలని ఆదేశాలు ఇచ్చినా సంబంధిత అధికారులు బేఖాతరు చేస్తున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి.

ఫిట్‌నెస్ కోసం డీఎఫ్ఎల్ లీగ్



వివరాలు వెల్లడిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

వెంకటేశ్వరకాలనీ: రోటరీ క్లబ్ సభ్యుల్లో ఫిట్‌నెస్, ఆరోగ్యంపై మరింత అవగాహన, శ్రద్ధ పెంచడం కోసం ఓ వినూత్న కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ శ్రీకారం చుట్టింది. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దక్కన్ ఫిట్‌నెస్ లీగ్–2023(డీఎఫ్ఎల్) కార్యక్రమానికి సంబంధించిన వివరాలను క్లబ్ అధ్యక్షుడు అనిల్ రాంచందాని వివరించారు. క్లబ్ సభ్యులు ప్రతిరోజూ వ్యాయామం చేస్తున్న వీడియోలను పోస్ట్ చేయాల్సి ఉంటుందని.. దీని కోసం ఏడుగురు సభ్యులతో ఆరు జట్లను తయారు చేస్తామన్నారు. వ్యాయామానికి సంబంధించిన వీడియోలను నెల రోజుల పాటు క్రమం తప్పకుండా పోస్ట్ చేయాలని ఎక్కువగా వ్యాయామం చేసే జట్టు సభ్యులను డీఎఫ్ఎల్ విజేతగా ప్రకటిస్తామన్నారు. అక్టోబర్ 29న ఫలితాలు వెల్లడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవేందర్ సురానా, సునీల్ జైన్, కిరణ్ గుత్తికొండ, మీర్ ముర్తుజా అలీ, నిషీత్ నాయక్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన కేసీఆర్

డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ

శేరిలింగంపల్లి: పేదల సొంతింటి కలను సాకారం చేసిన మహరాజు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అని ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి నల్లగండ్లలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ళను తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావుగౌడ్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎస్.హరీష్, శేరిలింగంపల్లి తహశీల్దార్ శ్రీనివాసరావు, కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, వి.జగదీశ్వర్‌గౌడ్, పూజిత జగదీశ్వర్‌గౌడ్, మంజుల రఘునాథ్‌రెడ్డి, మాధవరం రోజా రంగారావు, నార్నె శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాలతో కలిసి ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ లబ్ధిదారులకు ఇళ్ళ కేటాయింపు పత్రాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్క పైసా ఖర్చు లేకుండా పేదవాడికి ఇళ్ళను అందించిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. శేరిలింగంపల్లిలో మూడు విడతల్లో కలిపి 2,819 మందికి ఇళ్ళను కేటాయించినట్లు తెలిపారు. నల్లగండ్లలో 216 మందికి, హఫీజ్‌పేట్ సాయినగర్‌లో 128 మందికి ఇళ్ళను పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి ఈ నెల 5వ తేదీన కేటాయించనున్నట్లు వివరించారు. డబుల్‌బెడ్ రూం సముదాయంలో పార్కు, చిన్న పిల్లలకు క్రీడా స్థలం వంటి వసతులు కల్పించినట్లు తెలిపారు. అనంతరం గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డబుల్ బెడ్‌రూం సముదాయంలో మొక్కలు నాటారు.



మంజూరుపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ తదితరులు

ఆలోచింపచేసిన 'క్వశ్చన్' స్ట్రీట్ ప్లే

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన 'క్వశ్చన్' స్ట్రీట్ ప్లే అందరినీ ఆలోచింపచేసింది. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ప్రోగ్రెసివ్ థియేటర్ గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మూడుచోట్ల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యంగా రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగ సమస్య, ప్రైవేట్ విద్యాసంస్థలు పెరగడం, ఇతర ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉన్నా ఎవరూ ముందుకు రాకపోవడంతోనే ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా నిర్ణయాలు చేస్తూ పోతున్నాయని అవగాహన కల్పించారు. హెచ్‌సీయూ విద్యార్థులు అజయ్, పూజ, రూపమ్, పంకజ్, అనన్యతోపాటు పలువురు సభ్యులు ప్రదర్శనలో పాల్గొన్నారు. మొదట నార్త్ షాపింగ్ కాంప్లెక్స్, ఆ తర్వాత సౌత్ షాపింగ్ కాంప్లెక్స్, నార్త్ ఎల్ హెచ్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులను, దర్శకుడు జాన్ బషీర్‌ను పలువురు అభినందించారు.



సంక్షేమం, అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత

ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని వినాయకనగర్‌లో రూ.1.05 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్లను ఆయన మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా కాలనీలు,బస్తీలలో అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మారుస్తున్నామన్నారు. అన్ని రంగాలలో శేరిలింగంపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. గచ్చిబౌలి డివిజన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ నిధులను కేటాయించామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గణేష్ ముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, చెన్నంరాజు, వినోద్, మల్లేష్, రమేష్‌గౌడ్, రాజుముదిరాజ్, నారాయణ, హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులు అమర్‌నాథ్, కరుణాకర్, మహేందర్, నాగిరెడ్డి, రఘునాయుడు, వేణు, చంద్రశేఖర్, కాలనీవాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ,

బీసీలు రాజ్యాధికారాన్ని దక్కించుకోవాలి




బీసీ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథ్ యాదవ్


హఫీజ్‌పేట్: బీసీలు రాజ్యాధికారాన్ని దక్కించుకోవాలని, శేరిలింగంపల్లి నియోజకవర్గంను బీసీలకు అడ్డాగా మార్చుకుందామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం చందానగర్‌లోని సుప్రజ హోటల్‌లో జన జాగరణ బీసీ ఐక్యవేదిక చైర్మన్ బేరి రాంచందర్ యాదవ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం బీసీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు తమ హక్కుల కోసం పోరాడాల్సి రావడం దారుణమన్నారు. ఓట్లు మనవి సీట్లు మనకు అనే నినాదంతో ముందుకు సాగితేనే న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకు 60 సీట్లు కేటాయించాలన్నారు. బీసీలు ఐక్యత చాటే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాములుగౌడ్, భరత్ యాదవ్, కిరణ్, పవన్, రాజేష్, బీసీ యువజన సంఘం అధ్యక్షులు శ్రీరామ్ యాదవ్, అందెల కుమార్ యాదవ్, ప్రభాకర్ యాదవ్, గణేష్ యాదవ్, మహిళా నాయకురాలు సరోజమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

నిజాంపేట్: బీజేపీ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తోందని, ఇందులో భాగంగానే ములుగు జిల్లాలో గిరిజనుల వనదేవతలు సమ్మక్క సారక్కల పేరుతో గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించారని ఆ పార్టీ గిరిజన మోర్చా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రనాయక్ అన్నారు. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం గిరిజన మోర్చా ఆధ్వర్యంలో ప్రగతినగర్‌లోని అల్లూరి సీతారామరాజు సర్కిల్‌లో ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో తాగుడుకు పెద్దపీట వేస్తూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. ప్రధాని నరేంద్రమోడీ రూ.900 కోట్లతో గిరిజన యూనివర్శిటీకి రూపకల్పన చేశారని, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెద్దపీట వేస్తున్న ఏకైక ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వమన్నారు. మున్సిపల్ అధ్యక్షుడు ఆకుల సతీష్, రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సులోచన, సీనియర్ నాయకుడు దొంతి శిల్పారెడ్డి, రాష్ట్ర ఎస్సీ మోర్చా దాసి నాగరాజు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ కో.కన్వీనర్ డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు, పార్లమెంట్ మీడియా సెల్ కో.కన్వీనర్ సుమన్‌రావు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మదన్‌గౌడ్, మహిళలు పాల్గొన్నారు.

కనువిందు.. కూచిపూడి నృత్య ప్రదర్శన





మాదాపూర్ శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్స్ ఉత్సవ్ సందర్శకులను ఆకట్టుకుంటుంది. గుజరాత్ చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా సోమవారం శిరీష దేవులపల్లి శిష్యబృందంచే దేశభక్తి గీతాలు, మహాత్మాగాంధీపై గీతాలను ఆలపించారు. లక్ష్మీ శంకర్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన సందర్శకులను అలరించింది.